విద్యార్థుల పెండింగ్ ఫీజులు విడుదల చేయాలి
ఉప ముఖ్యమంత్రికి ఆర్.కృష్ణయ్య వినతి


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

రాంనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 14లక్షల మంది విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజుబకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్ యూనివర్సిటీ అడ్మిషన్‌లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు చెల్లించాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని డిప్యూటీ సీఎంకు వివరించినట్లు చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి మట్లాడుతూ 8 రోజుల్లో ఫీజు బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం ప్రతినిధులు నీల వెంకటేష్, జిల్లపల్లి అంజి, భూపేష్‌సాగర్, సి.రాజేందర్, మణికంఠ, పగిళ్ల సతీష్, శివ పాల్గొన్నారు.

జర్నలిస్టు ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానం తేవాలి : టీడబ్ల్యూజేఎఫ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానం తేవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.బసవపున్నయ్య విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల త్యాగరాయ గానసభలో నిర్వహించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం కొత్త విధానంపై, మీడియా స్వేచ్ఛను కాపాడాలని, కొత్త అక్రిడిటేషన్లను మంజూరు చేయాలని, చిన్న, మధ్య తరహా పత్రికల సమస్యలను పరిష్కరించాలని తీర్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఆఫీసు బేరర్లు చంద్రశేఖర్, దయాసాగర్, కృష్ణ, వెంకటేష్, రఘు, సలీమ, జగదీష్, రాజశేఖర్, నిరంజన్, బిక్షపతి, మణిమాల, నాగవాణి, విజయ పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్లతో ఇంటి కబ్జాకు యత్నించిన వ్యక్తి రిమాండ్

అంబర్‌పేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఓ ఇంటిని కబ్జా చేయడానికి ప్రయత్నించిన ఓ వ్యక్తిని అంబర్‌పేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. సీఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్ అంబర్‌పేట డీడీకాలనీకి చెందిన పోల దాస్ వెంకటయ్య నివాసం ఉండేవాడు. అతనికి పిల్లలు లేకపోవడంతో తన తమ్ముడు పోల్ దాస్ సత్యనారాయణ కూతురిని దత్తత తీసుకున్నాడు. 2016 వెంకటయ్య మృతిచెందగా 2022లో ఆయన భార్య ఇంటి నుంచి అదృశ్యమైంది. అప్పటి నుంచి ఆ ఇంటిలో వెంకటయ్య తమ్ముడు పోల్దాస్ సత్యనారాయణ నివాసం ఉంటున్నాడు. అయితే రామంతపూర్‌లో నివాసం ఉండే అడ్వకేట్ వినోద్ వెంకటయ్య ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు సంపాదించాడు. వెంకటయ్య ఇంటిని రామంతపూర్‌కు చెందిన పచ్చిపాల రమేష్ చారికి 2016లో విల్ డీడ్ ఇచ్చినట్లు పత్రాలు సృష్టించి రూ.65 లక్షలకు విక్రయించినట్లు పత్రాల్లో పేర్కొన్నాడు. ఈ ఇంటిపై రమేష్ చారి నిర్మాణం కోసం రూ.80 లక్షలు బ్యాంకు నుంచి అప్పుగా తీసుకున్నాడు. అయితే గతనెల 22న రమేష్ చారి ఇది తన ఇల్లు అని సత్యనారాయణ ఉంటున్న ఇంటికెళ్లాడు. దీంతో ఆశ్చర్యపోయిన సత్యనారాయణ ఈ విషయంపై అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ జరిపి అడ్వకేట్ వినోద్ నకిలీ పత్రాలు సృష్టించినట్లు కనుగొన్నారు. రమేష్ చారిని విచారించగా అతడు నిజం అంగీకరించాడు. పోలీసులు రమేష్ చారిని బుధవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు అడ్వకేట్ వినోద్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఉప్పలమ్మ దేవాలయ వార్షికోత్సవం

ముషీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ గంగపుత్రకాలనీ చేపల మార్కెట్‌లోని ఉప్పలమ్మ దేవాలయం వార్షికోత్సవ పూజలు బుధవారం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు పూస శ్రీకృష్ణ, బొల్లంపల్లి రాంరెడ్డి, జమాల్‌పురి నందు, బద్రినారాయణ, నర్సింగ్‌ప్రసాద్, మహేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కంటిచూపును నిర్లక్ష్యం చేయొద్దు

ముషీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కంటిచూపు సమస్య ఉంటే నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జైసింహ అన్నారు. బుధవారం మోహన్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో అక్యూలెస్ ఐహాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జైసింహ వైద్య శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రైవేటు వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పేదప్రజలు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు.

మహాకాళి ఆలయ కమిటీ చైర్మన్‌కు సన్మానం

ముషీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహాకాళి దేవాలయ నూతన కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బి.నరేష్ కుమార్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఆలిండియా ఫిషర్‌మెన్ కమిటీ ఉపాధ్యక్షుడు పూసగోరక్‌నాథ్, ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్, భవాని దేవాలయ కమిటీచైర్మన్ మేడి సురేష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్నం సతీష్‌గౌడ్, రమేష్, మురళీమోజేస్ తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు.

విద్యార్థులకు శాసన ప్రక్రియపై అవగాహన

బర్కత్‌పుర, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు శాసన ప్రక్రియపై ప్రత్యక్ష అనుభం కల్పించే లక్ష్యంతో అర్థ శాస్త్ర ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ క్షేత్ర పర్యటన నిర్వహించినట్లు అకాడమీ సీనియర్ ఫ్యాకల్టీ సతీష్ పెండ్యాల, అలేఖ తెలిపారు. బుధవారం శాసన సభ పర్యటన నిర్వహించినట్లు కాచిగూడలో ఏర్పాటుచేసిన సమావేశంలో వెల్లడించారు. శాసన వ్యవస్థ విధానాలు, ప్రజాస్వామ్యంలో శాసనసభ పాత్రపై అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా శాసన సభ కార్యదర్శి నర్సింహ ఆచార్యులను కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సందీప్ మహాజన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరుద్యోగలకు ఉపయోగకరంగా గ్రంథాలయాలు

చిక్కడపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పోటీపరీక్షలకు ప్రిపేర్ అయ్యే వారితోపాటు నిరుద్యోగులకు, విద్యార్థులకు సైతం గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు డా.ఎస్ఆర్.రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థలోని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ, ఉద్యోగులు సుబ్బలక్ష్మి, ప్రతిభారెడ్డి, మహేందర్, అవినాష్‌రావు, వెంకటేష్‌యాదవ్, పోటీపరీక్షల అభ్యర్థులు పాల్గొన్నారు.

కల్తీ కల్లుకు బానిసై.. వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కల్తీ కల్లుకు బానిసైన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడలో నివాసముంటున్న దశరథ్(44) కాచిగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఉద్యోగం చేశాడు. కల్తీకల్లుకు బానిసై.. ఉద్యోగం మానేసి ఇంటి వద్దనే ఉంటూ చికిత్స పొందుతున్నాడు. మంగళవారం రాత్రి భార్యతో గొడవపడి రైలు కిందపడి చనిపోతానంటూ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అర్థరాత్రి ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ సమీరంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న కాచిగూడ రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దశరథ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం తర్వాత కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


ర్యాలీలో పాల్గొన్న డా.లక్ష్మణ్



బీజేపీ అధిష్ఠానం పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో ఆ పార్టీ నేతలు హర్ ఘర్ తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. మహనీయుల విగ్రహాలను నీళ్లు, పాలతో కడిగి, శుద్ధిచేశారు. ఈపవేడుకల్లో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, బండారు విజయలక్ష్మి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా యాత్ర



రాంనగర్‌లో హర్ ఘర్ తిరంగా యాత్రలో పాల్గొన్న మాజీ గవర్నర్ దత్తాత్రేయ, బండారు విజయలక్ష్మి తదితరులు


డీడీ కాలనీలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన బీజేపీ నేతలు డాక్టర్ గౌతమ్‌రావు, అజయ్‌కుమార్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు

రాంనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఇందులో భాగంగా బండారు వైష్ణవ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో రాంనగర్ ఈ-సేవా నుంచి రాంనగర్ చౌరస్తా వరకు తిరంగాయాత్రను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరై ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతికోసం ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటిపై ఆగస్టు 15వ తేదీన తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేయాలని అన్నారు. ఈర్యాలీలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నరేష్, శ్రీకాంత్‌గౌడ్, ఓంప్రకాష్ తదితర నాయకులు, కార్యకర్తలు, వేద కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

రాంనగర్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో..

రాంనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గడ్డం సతీష్ ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లిలో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పార్థసారధి, జైపాల్‌రెడ్డి, కలకోట అరుణ్, శీలం ప్రవీణ్, ఉపేందర్, జక్క శ్రీనివాస్, ఉమామహేశ్వర్, మంగళ, జ్యోతి, బన్సి నాయక్, ప్రవీణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


బాగ్‌లింగంపల్లిలో హర్ ఘర్ తిరంగా యాత్రను నిర్వహిస్తున్న బీజేపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు సతీష్ తదితరులు

బాగ్ అంబర్‌పేట డీడీ కాలనీలో...

బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నాగరాజచారి ఆధ్వర్యంలో డివిజన్‌లోని డీడీ కాలనీలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ విగ్రహానికి నీళ్లు, పాలతో శుభ్రం చేసి మహనీయుల సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు, నాయకులు ఎడెల్లి అజయ్‌కుమార్, పి.గోవర్ధన్‌రెడ్డి, అచ్చిని రమేష్, కె.చంద్రశేఖర్, దత్తు ముదిరాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో ర్యాలీ


తిరంగా ర్యాలీలో బీజేపీ నేతలు

అంబర్‌పేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ నేతలు బుధవారం తిరంగార్యాలీ నిర్వహించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు చిదుగు నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో అనంతరామ్‌నగర్ నుంచి అలీకేఫ్, ప్రేమ్‌నగర్, పటేల్‌నగర్, నరేంద్రనగర్, చెన్నారెడ్డినగర్ మీదుగా బాపునగర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ ప్రజలలో జాతీయ భావాన్ని పెంపొందించడానికి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు, ప్రతి ఇంటిపై ఆగస్టు 15 వతేదీన ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు దాసోజు నాగభూషణం చారి, మైలారం రాజు, వెంకటస్వామి గౌడ్, బిక్షపతి, యశ్వంత్, రాంచందర్‌గుప్తా, పెంటం రాజు, దయాకర్ యాదవ్, నవీన్‌రెడ్డి, ఆర్.కృష్ణముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మణ్, భాస్కర్‌గౌడ్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అగ్రగామిగా భారత్ : ఎంపీ లక్ష్మణ్

చిక్కడపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా మారుతోందని బీజేపీ ఓబీసీమోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల్లో భాంగా బుధవారం అశోక్‌నగర్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు బీజేపీ మహాకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, బీజేవైఎం అధ్యక్షుడు మద్దూరి శివాజీ ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన డా.లక్ష్మణ్ అశోక్ నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రతిఇంటిపై మువ్వన్నెల జాతీయజెండా ఎగురవేసి మన దేశభక్తిని చాటుకోవడానికే తీసుకున్న కార్యక్రమమే ఈ తిరంగా యాత్ర అని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేత వెంకటరమణి, కార్పొరేటర్లు రవిచారి, సుప్రియ, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్‌కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, పార్టీ నాయకులు జైపాల్‌రెడ్డి, రత్నసాయిచంద్, నవీన్‌కుమార్, మహమూద్, డా.డీఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారీగా కురుస్తున్న వర్షాల మూలంగా అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ అన్ని చర్యలను కుంటున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. ప్రజలు కూడా వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం గోల్నాక డివిజన్‌లోని సంజయ్‌గాంధీ నగర్ (టక్కీజైలు)లో నూతనంగా రూ.36లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన వర్షపు నీటి పైపులైన్ పనులకు కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థపన చేశారు. అనంతరం బస్తీలో పర్యటించి ప్రజలను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అనవసరంగా బయట తిరిగి సమస్యలను కొనితెచ్చుకోవద్దన్నారు. మూసీ ప్రవాహం, నాలా ప్రవాహం ఉధృత్తంగా ఉండడంతో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, జలమండలి అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


గోల్నాక డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లో వర్షపునీటి పైపులైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

అభివృద్ధి పనులకు చర్యలు తీసుకోండి

గోల్నాక: అంబర్‌పేట నియోజకవర్గంలో నూతనంగా చేపట్ట బోయే అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని వేర్వేరుగా వారి కార్యాలయాలలో కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి వినతిపత్రాలను అందజేశారు. వారు స్పందించి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రభుత్వ స్థలాల్లో కమ్యూనిటీ హాళ్లు కట్టిస్తాం

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజల కోరిక మేరకు కాలనీ, బస్తీల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలలో కమ్యూనిటీ హాళ్లను కట్టిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. బుధవారం బోలక్‌పూర్ డివిజన్ రంగానగర్ సెకండ్ వెంచర్‌లో జీహెచ్ఎంసీ డీఈ సన్నీతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. స్థానికంగా 400 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయని, శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు స్థలం లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఫిర్యాదు చేశారు. స్థానికంగా ఉన్న ఖాళీస్థలంలో కమ్యూనిటీ హాల్ కట్టించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో రంగానగర్ సెకండ్ వెంచర్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకు చేరుకుని, వర్షాల వల్ల కూలిపోయిందని పేర్కొన్నారు. ఇదే స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి స్థానిక ప్రజలకోరికను నెరవేర్చే విధంగా పనిచేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే గోపాల్‌ను వై.శ్రీనివాస్‌రావు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత బింగి నవీన్, నాయకులు రహీం, రంగానగర్ బస్తీ ప్రధానకార్యదర్శి వినోద్, నాయకులు మల్లేష్, ధర్మేందర్, సుమన్, కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, రంగానగర్ మహిళలు

అర్హులైన పేదలకు పక్కా గృహాలు ఇవ్వాలి

కార్పొరేటర్ సుప్రియా గౌడ్

ముషీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రజాపథంలో పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేద ప్రజలందరికీ పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ డిమాండ్‌చేశారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని మొరంబొంద ప్రాంతానికి చెందిన ప్రజలు ఇటీవల పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకుంటే ఎల్-3 అని (సొంత ఇల్లు ఉన్నాయని) అధికారులు తప్పుడు రిపోర్టులు రాశారని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, రెవెన్యూఅధికారులు మొరంబొందలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... పక్కా గృహాల కోసం 53మంది స్థానికులు దరఖాస్తు చేసుకున్నారని అందులో ఏ ఒక్కరికీ సొంత ఇళ్లు లేవని పేర్కొన్నారు. అద్దె ఇళ్లలో నివసించే వీరందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. ఎంఆర్‌వో రాణాప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటింటికీ దరఖాస్తుదారుల వివరాల కోసం సర్వే చేస్తున్నామని తెలిపారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ముదిరాజ్, నాయకులు సత్యనారాయణ, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.


మొరంబొంద ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి సర్వేచేస్తున్న ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

గొప్ప వ్యక్తి వట్టికోట ఆళ్వారుస్వామి

చిక్కడపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఊరూరా గ్రంథాలయాలను స్థాపించడంతోపాటు రచయితల రచనలు సైతం ప్రచురించిన గొప్ప వ్యక్తి వట్టికోట ఆళ్వారుస్వామి అని సీబీఐ కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ఎందరో మహానుభావులు శీర్షికన జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ ప్రజాసాహితీవేత్త వట్టికోట ఆళ్వారుస్వామి జయంతిని గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ నాగమారుతి శర్మ మాట్లాడుతూ ఆళ్వారుస్వామి తెలంగాణ నవయుగ వైతాళికుడన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి శైలజామిత్ర, సినీనటుడు మాణిక్, వందే భారత్ సినీదర్శకుడు మల్లం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా డొనేషన్‌లు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

బర్కత్‌పుర, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా డొనేషన్‌లు వసూలు చేస్తున్న పలు ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని ఓయూ జేఏసీ అధ్యక్షుడు బైరు నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. పలు కళాశాలల ముందు బుధవారం ధర్నా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ధర్మపురి శంకర్, సుబ్బునాయక్, జెక్కుల మధు, జూలూరి మహేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు పూడిక తీత చేపట్టాలి

అంబర్‌పేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పూడికతీత పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని పటేల్‌నగర్, బాపునగర్, ప్రేమ్ నగర్‌లో ఆయన పాదయాత్ర చేశారు. ప్రేమ్‌నగర్‌లో డ్రైనేజీ లీకేజీ సమస్యను స్థానికులు కార్పొరేటర్‌కు విన్నవించారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే జలమండలి సిబ్బందిని పిలిపించి, డ్రైనేజీని శుభ్రం చేయించారు. వర్షాకాలంలో పూడిక తీయకుండా నిర్లక్ష్యం వహించరాదని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ ప్రదీప్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ద్వైపాక్షిక ఒప్పందాల నుంచి భారత్ వైదొలగాలి

రాంనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ద్వైపాక్షిక ఒప్పందాల నుంచి భారత్ వైదొలగాలని పలు కార్మిక సంఘాలు కేంద్రాన్ని డిమాండ్ చేశాయి. క్విట్ కార్పొరేట్స్ నిరసనలో భాగంగా బుధవారం నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద సంయుక్త కిసాన్‌మోర్చా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూకేఎం రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, పశ్య పద్మ, వెంకన్న, నాగిరెడ్డి, వెంకటరాములు, ప్రసాద్, వీరయ్య, బాల్‌రాజ్, పద్మ అనురాధ మాట్లాడుతూ దేశానికి నష్టం కలిగించే ఒప్పందం నుంచి బారత్ వైదొలిగేవరకు పోరాడతామన్నారు.

ఆగని వర్షం.. తప్పని ఇబ్బందులు

కవాడిగూడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం నేపథ్యంలో ఆగడం లేదు. దీంతో ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో ప్రజలు, వాహనదారులు, పాదచారులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది బుధవారం ఇళ్ల నుంచి బయటకు రాలేదు. పాఠశాలలకు ప్రభుత్వం నగం పూట బడులు నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వడం వల్ల మధ్యాహ్నమే పాఠశాలు మూతపడ్డాయి. కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు పేరుకుపోయింది. చిరువ్యాపారులు, అడ్డాకూలీలలు ఉపాధి లేక ఇబ్బందులు పడ్డారు.

ఆకట్టుకున్న గానవిభావరి

చిక్కడపల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖసంస్థ చంద్రతేజాలయ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించిన గానవిభావరి ఆకట్టుకుంది. సృష్టి ఆర్ట్స్ అభినందనలతో స్వరాభిషేకం గాయనీగాయకులు చంద్రతేజ, డీఏ.మిత్ర, శశికళాస్వామి, సురేఖామూర్తి ఘంటసాల గానామృతం చేశారు. సంస్థ అధ్యక్షుడు చంద్రతేజ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిక చేసిన గీతాలను మధురంగా ఆలపించారు.

తల్లిదండ్రుల పేరుతో ఉత్తమ కార్యక్రమాలు..

చిక్కడపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల పేర్లు స్థిరంగా నిలిపేందుకు ఉత్తమ కార్యక్రమాలు నిర్వహించడం సంస్కారవంతం అని కేంద్ర మాజీ మంత్రి ఎస్. వేణుగోపాలచారి అన్నారు. హైమావతిభీమన్న తన తల్లిదండ్రులను స్మరిస్తూ 22 సంవత్సరాలుగా కవులు, కళాకారులకు నగదు పురస్కారం అందిస్తూ తన ప్రేమ వారిపై చాటుకున్నారని పేర్కొన్నారు. భీమన్న సాహితీనిధి, కళానిలయం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో రచయిత్రి, గాయని హైమవతిభీమన్న జన్మదినోత్సవం సందర్భంగా తన తల్లిదండ్రులు కొత్తూరు వెంకటలక్ష్మి, సుబ్బయ్యదీక్షితులు స్మారక పురస్కారం ప్రముఖ రచయిత్రి ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మికి ప్రదానం చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, రచయితలు డా.జయరాములు, ఆలూరి విజయలక్ష్మి, డా. గురజాడ శోభాపేరిందేవి, కళానిలయం సురేందర్ తదితరులు, నాట్యగురువు రేణుకాప్రభాకర్ శిష్యబృందం పాల్గొన్నారు.